నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence

www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

nipuna
Every Wednesday Free Supplement




**కెనడా మంత్రులు**

కెనడా నూతన ప్రధాని మార్క్ కార్నీ మంత్రివర్గంలో ఇద్దరు భారత సంతతి ఎంపీలకు స్థానం లభించింది. ఇండో-కెనడియన్ అనిత ఆనంద్, ఢిల్లీలో జన్మించిన కమల్ ఖేరాకు మంత్రి పదవులు దక్కాయి. కార్నీ, ఆయన మంత్రివర్గ సభ్యులు మార్చి 14న ప్రమాణ స్వీకారం చేశారు. అనితకు ఇన్నోవేషన్, సైన్స్, పరిశ్రమల శాఖ, కమల్ ఖేరాకు ఆరోగ్య శాఖ ఇచ్చారు. కెనడా పార్లమెంటుకు ఎన్నికైన అత్యంత పిన్న వయస్కులైన మహిళల్లో కమల్ ఖేరా ఒకరు.

# ప్రజాపరిషత్ అనే సంస్థను 1972లో స్థాపించింది ఎవరు?

## గతవారం తరువాయి..

**7. ముల్కీ నిబంధనలపై ఆఖరి తీర్పు ఎప్పుడు వెలువడింది?**

1) 1973, ఫిబ్రవరి 17
2) 1972, అక్టోబర్ 3
3) 1972, జూలై 11
4) 1973, అక్టోబర్ 3

**సమాధానం: 2**

**వివరణ:** 1972, అక్టోబర్ 3న సుప్రీంకోర్టు, గతంలో హైకోర్టు

- ఫుల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేసి 'ముల్కీ నిబంధనలు రాజ్యాంగబద్ధమైనవే' అని తీర్పునిచ్చింది.
- తెలంగాణ ప్రాంతంలో 15 సంవత్సరాలు నివసించి ఉంటేనే ఆ ప్రాంతంలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకానికి అర్హత ఉంటుందని, అర్ధశతాబ్దం క్రితం నిజాం ప్రవేశ పెట్టిన ముల్కీ నిబంధన నేటికీ చెల్లుతుందని, రాజ్యాంగంలోని అధికరణ 35(బి) కింద ముల్కీ నిబంధనలు నేటికీ అమల్లో ఉన్నట్లేనని సుప్రీంకోర్టు పేర్కొంది.
- ఆంధ్ర-తెలంగాణ ప్రాంతాల విలీనీకరణతో ఆంధ్రప్రదేశ్ అవతరించినప్పటికీ ఆ నిబంధన అమల్లో ఉన్నట్లేనని తీర్పునిచ్చింది.

**8. పంచసూత్ర పథకం 1972కు సంబంధించి కింది వాటిలో సరికానిది?**

1) ఈ పథకాన్ని 1972, నవంబర్ 27న లోక్‌సభలో ప్రకటించారు
2) ఈ పథకం ప్రకారం తెలంగాణ ప్రాంతంలో నాన్ గెజిటెడ్ ఉద్యోగాలకు తహసీల్దార్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, జూనియర్ ఇంజినీరింగ్ పదవులకు ముల్కీ నిబంధనలు వర్తించవు
3) ఈ పథక రక్షణలు తెలంగాణ ప్రాంతంలో 1980, డిసెంబర్ ఆఖర వరకు రాజధాని హైదరాబాద్ నగరంలో 1977 డిసెంబర్ వరకు అమల్లో ఉంటాయి
4) ఈ పథకం ప్రకారం హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలకు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన ఉమ్మడి పోలీస్ బలగాలు ఉంటాయి

**సమాధానం: 2**

**వివరణ:** పంచసూత్ర పథకం- 1972

- 1972, అక్టోబర్ 3న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నాటి నుంచి పలు దఫాలుగా ఆంధ్ర, తెలంగాణ ప్రాంత నేతలతో చర్చించిన ప్రధాని ఇందిరా గాంధీ రెండు ప్రాంతాల్లో ప్రజలకు సంతృప్తి పరచాలనే ఉద్దేశంతో 1972, నవంబర్ 27న పంచసూత్ర పథకాన్ని లోక్‌సభలో ప్రకటించింది.

**పథకంలోని అంశాలు**

1) తెలంగాణ ప్రాంతంలో నాన్ గెజిటెడ్ ఉద్యోగాలకు, తహసీల్దార్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, జూనియర్ ఇంజినీర్ పదవులకు ముల్కీ నిబంధనలు వర్తిస్తాయి.

- సచివాలయం, వివిధ శాఖాధిపతుల కార్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఇతర ఉమ్మడి సంస్థల్లో నాన్ గెజిటెడ్ ఉద్యోగాల్లో నేరుగా నియమించడంలో 'ప్రతి మూడింటిలో రెండో ఉద్యోగానికి' ముల్కీ నిబంధన వర్తిస్తుంది.

2) ఈ రక్షణలు తెలంగాణ ప్రాంతంలో 1980, డిసెంబర్ నెలాఖరు వరకు అమల్లో ఉంటాయి. రాజధాని హైదరాబాద్‌లో 1977, డిసెంబర్ నెలాఖరు వరకు ఇవి అమల్లో ఉంటాయి.
3) ఆంధ్ర-తెలంగాణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగ ప్రమోషన్లకు తగిన అవకాశాలు కలిగించేందుకు వీలుగా ప్రథమ లేదా ద్వితీయ గెజిటెడ్ స్థాయి వరకు వివిధ సర్వీసుల క్యాడర్లు ప్రాంతీయం చేశారు.
4) జంట నగరాల్లో తెలంగాణ విద్యార్థులకు ప్రస్తుతం లభిస్తున్న సాంకేతిక, వృత్తి విద్యలతో సహా విద్యాసౌకర్యాలకు ఎలాంటి హాని కలిగించలేదు.

- విద్యాసంస్థల్లో అదనంగా కొన్ని స్థానాలు సృష్టిస్తారు. కొత్తగా సృష్టించిన స్థానాలు బేషరతుగా ఏ ప్రాంతం వారైనా పొందవచ్చు.

5) హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలకు ఆంధ్ర, తెలంగాణ రెండు ప్రాంతాలకు చెందిన ఉమ్మడి పోలీస్ బలగాలు ఉంటాయి.

- ఈ పంచసూత్ర పథకం ఇరు ప్రాంతాల ప్రజలకు సంతృప్తిపరచకపోగా ప్రత్యేక రాష్ట్రోద్యమాలకు దారి తీసింది.
- ప్రధాని పంచసూత్ర పథకం 'తెలంగాణ రక్షణలకు గొడ్డలిపెట్టు' అని డాక్టర్ చెన్నారెడ్డి వ్యాఖ్యానించారు.
- పంచసూత్ర పథకంపై గౌతు లచ్చన్న మాట్లాడుతూ 'మహారాజుకు మనవి చేసుకుంటే మరో రెండు దెబ్బలు వేయమన్న చందంగా' ఈ పంచసూత్ర పథకం ఉందని పేర్కొన్నాడు.
- ఏపీఎన్‌జీవోల సంఘం అధ్యక్షుడు రామకృష్ణారావు మాట్లాడుతూ పంచసూత్ర పథకం కందిరీగల తెట్టె వంటిది. దీనివల్ల ఒక్క సమస్య కూడా పరిష్కారం కాకపోగా మరిన్ని సమస్యలను సృష్టిస్తుందని పేర్కొన్నాడు.
- ఈ పథకం అమల్లోకి రాలేదు.

**9. కింది ఏ పథకాన్ని మర్రి చెన్నారెడ్డి 'తెలంగాణ రక్షణలకు గొడ్డలి పెట్టు' అని అన్నాడు?**

1) అష్ట సూత్ర పథకం
2) ఆరు సూత్రాల పథకం
3) ఐదు సూత్రాల పథకం
4) రాష్ట్రపతి ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్- 1975

**సమాధానం: 3**

**వివరణ:** ఈ పంచసూత్ర పథకం ఇరు ప్రాంతాల ప్రజలను సంతృప్తి పరచకపోగా ప్రత్యేక రాష్ట్రోద్యమాలకు దారి తీసింది.

- ప్రధాని పంచసూత్ర పథకం 'తెలంగాణ రక్షణలకు గొడ్డలి పెట్టు' అని మర్రి చెన్నారెడ్డి వ్యాఖ్యానించారు.

**10. కింది వాటిలో సరైనవి గుర్తించండి?**

ఎ. తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన పీవీ నరసింహారావు 1971, సెప్టెంబర్ 30న ఆంధ్రప్రదేశ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు
బి. 1973, జనవరి 10న పీవీ నరసింహారావు తన పదవికి రాజీనామా చేశారు
సి. 1973, జనవరి 18 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించారు

1) ఎ, బి　2) బి, సి
3) ఎ, సి　4) ఎ, బి, సి

**సమాధానం: 4**

**వివరణ:** తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన పీవీ నరసింహారావు 1971, సెప్టెంబర్ 30న ఆంధ్రప్రదేశ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. 1973, జనవరి 10న పీవీ నరసింహారావు తన పదవికి రాజీనామా చేశారు. 1973, జనవరి 18 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించారు.

**11. 1972, ఫిబ్రవరి 17న ఎక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఇందిరా గాంధీ ప్రసంగిస్తూ తెలంగాణ వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూసుకుంటామని పేర్కొన్నారు?**

1) కరీంనగర్　2) హైదరాబాద్
3) ఖమ్మం　4) వరంగల్

**సమాధానం: 4**

**వివరణ:** 1972, ఫిబ్రవరి 17న వరంగల్‌లోని ఆజంజాహీ బట్టల మిల్లు మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఇందిరాగాంధీ ప్రసంగిస్తూ తెలంగాణ వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూసుకుంటానని పేర్కొన్నారు.

- ఇందిరాగాంధీ ప్రోద్బలంతో పీవీ నరసింహారావు హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేశారు. పీవీ నరసింహారావు వియ్యంకుడైన కే నర్సింగరావు ఈ కేసును సుప్రీంకోర్టులో వాదించాడు.

**12. 1972, అక్టోబర్ 18న ప్రజాపరిషత్ అనే సంస్థను స్థాపించింది ఎవరు?**

1) కాకాని వెంకటరత్నం　2) గౌతు లచ్చన్న
3) నడింపల్లి నర్సింహారావు
4) బీవీ సుబ్బారెడ్డి

**సమాధానం: 2**

**వివరణ:** ప్రత్యేకాంధ్ర ఉద్యమ నిర్వహణ కోసం గౌతు లచ్చన్న అధ్యక్షుడిగా 'ప్రజాపరిషత్' అనే సంస్థను ఏర్పాటు చేశారు.

**13. కింది వాటిలో సరైనవి గుర్తించండి?**

ఎ. జై ఆంధ్ర ఉద్యమంలో భాగంగా 1972, డిసెంబర్ 17న మాదాల జానకీరాం అధ్యక్షతన ఆంధ్ర సేన అనే సంఘం ఏర్పడింది
బి. 1972, డిసెంబర్ 22న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోరుతూ కాకాని వెంకటరత్నం, ఎన్‌జీ రంగా గుంటూరులో భారీ బహిరంగ సభ నిర్వహించారు
సి. గుంటూరు సభ తర్వాత కాకాని వెంకటరత్నం 1972, డిసెంబర్ 25న గుండెపోటుతో మరణించారు

1) ఎ, బి　2) బి, సి
3) ఎ, సి　4) ఎ, బి, సి

**సమాధానం: 1**

**వివరణ:** జై ఆంధ్ర ఉద్యమంలో భాగంగా రాజీనామా చేసిన మంత్రులు ఇతరులు కలిసి 1972, డిసెంబర్ 17న మాదాల జానకీరాం అధ్యక్షతన 'ఆంధ్రసేన' అనే సంఘాన్ని ఏర్పాటు చేశారు.

- ఈ సంఘం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం తీర్మానం చేసింది.
- 1972, డిసెంబర్ 18న ప్రభుత్వోద్యోగులను ముల్కీలకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారనే అభియోగంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్‌జీవోల సంఘం అధ్యక్షుడు రామకృష్ణారావును బర్తరఫ్ చేసింది.
- 1972, డిసెంబర్ 22న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోరుతూ కాకాని వెంకటరత్నం, ఎన్‌జీ రంగా గుంటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు.
- 1972, డిసెంబర్ 23న పంచసూత్ర పథకానికి పార్లమెంట్ ఆమోదం తెలిపింది.
- ముల్కీ పొడిగింపు జరగదు, రాష్ట్ర విభజన అసంభవం, ప్రాంతీయాభివృద్ధి బోర్డుల ఏర్పాటు విషయం పరిశీలిస్తానని ప్రధాని అదేరోజు లోక్‌సభలో ప్రకటించారు.
- పార్లమెంట్ పంచసూత్ర ప్రణాళికకు చట్టబద్ధత కల్పించడంతో 1972, డిసెంబర్ 24న సమైక్యవాదులు, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) ప్రోద్బలంతో విజయవాడలో ఊరేగింపు చేశారు. ఈ ఊరేగింపునకు సీఎం పీవీ నరసింహారావు మద్దతు కూడా ఉంది.
- ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని కోరుతున్న కాకాని వెంకటరత్నం ఇంకా వందలాది మంది ప్రత్యేక రాష్ట్రవాదులు సమైక్యవాదుల ఊరేగింపును అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ చెలరేగి విధ్వంసం జరిగింది. దీంతో సీఆర్‌పీఎఫ్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది మరణించారు.
- ఈ కాల్పుల్లో ఆందోళనకారులు మరణించడం వల్ల తీవ్ర ఆవేదనకు గురై 1972, డిసెంబర్ 25న తెల్లవారుజామున కాకాని వెంకటరత్నం గుండెపోటుతో మరణించారు.

**14. ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ ఫోరాన్ని ఎవరు ఏర్పాటు చేశారు?**

1) మర్రి చెన్నారెడ్డి
2) కాకాని వెంకటరత్నం
3) గౌతు లచ్చన్న　4) బీవీ సుబ్బారెడ్డి

**సమాధానం: 1**

**వివరణ:** జై ఆంధ్ర ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సమయంలో మర్రి చెన్నారెడ్డి ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ ఫోరం ఏర్పాటు చేశారు.

- 1972, డిసెంబర్ 27న ఆంధ్ర వెంకటేశ్వర విద్యాలయ విద్యార్థుల ఐక్యకార్యాచరణ సమితి నెల్లూరులో సమావేశమయ్యింది. ఈ సందర్భంగా ఈ సమితి అధ్యక్షుడు బీజే అగస్టీన్ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ ఉద్యమంలో యువ నాయకుడు వెంకయ్య నాయుడు, వైఎస్సార్, చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.

**15. జై ఆంధ్ర ఉద్యమంలో 'జై ఆంధ్ర - జై తెలంగాణ' అనే నినాదం ఎవరిచ్చారు?**

1) గౌతు లచ్చన్న　2) వాజ్‌పేయి
3) పాగా పుల్లారెడ్డి　4) మర్రి చెన్నారెడ్డి

**సమాధానం: 2**

**వివరణ:** 1973, ఫిబ్రవరి 1న విజయవాడలో హరి అనంత పద్మనాభ శాస్త్రి అధ్యక్షతన న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సభ నిర్వహించారు.

- ఈ సభకు జనసంఘ్ పార్టీ అధ్యక్షుడు వాజ్‌పేయి హాజరై జై ఆంధ్ర-జై తెలంగాణ అనే నినాదం ఇచ్చారు. సీపీఐ పార్టీపై చురకలు వేస్తూ అది నిజానికి కమ్యూనిస్టు పార్టీగా పేర్కొనడానికి వీలులేదు. అది హర్ మెజిస్టీస్ రాయల్ అపోజిషన్ అని వాజపేయి విమర్శించారు. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో కాల్పులు జరిగాయి.
- ఈ సభలోనే కొడాలి దామోదరయ్య ఆగదురా ఇక ఆంధ్ర ఉద్యమం అనే పాటను పాడారు.

**16. కింది వాటిలో సరైనవి గుర్తించండి?**

ఎ. జై ఆంధ్ర ఉద్యమంలో జనసంఘ్ పార్టీ ఆంధ్ర, తెలంగాణ రెండు ప్రాంతాలు ప్రత్యేక రాష్ట్రాలుగా విడిపోవాలని నినాదం ఇచ్చాయి
బి. జై ఆంధ్ర ఉద్యమంలో పాగా పుల్లా రెడ్డి సమాఖ్య ఆంధ్రకు మద్దతు ఇచ్చారు

1) ఎ　2) బి　3) ఎ, బి　4) ఏదీకాదు

**సమాధానం: 1**

**వివరణ:** తెలంగాణ ప్రాంతంలో 1950-55లో విశాలాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహించి 1969లో సమైక్యవాదాన్ని వినిపించిన గద్వాల శాసన సభ్యుడు పాగా పుల్లారెడ్డి తాను ప్రత్యేక తెలంగాణను ఆకాంక్షిస్తున్నానని 1973, ఫిబ్రవరిలో పేర్కొన్నారు.

**17. ఆరు సూత్రాల పథకాన్ని ఇందిరా గాంధీ ఎప్పుడు ప్రకటించారు?**

1) 1972, నవంబర్ 27
2) 1973, సెప్టెంబర్ 21
3) 1973, అక్టోబర్ 27
4) 1972, సెప్టెంబర్ 21

**సమాధానం: 2**

**వివరణ:** ఆరు సూత్రాల పథకాన్ని ఇందిరాగాంధీ 1973, సెప్టెంబర్ 21న ప్రకటించారు.

- ఈ ఆరు సూత్రాల పథకం ద్వారా తెలంగాణలో ఎప్పటినుంచో ఉన్న ముల్కీ రూల్స్ చెల్లకుండా పోయాయి.
- గతంలో తెలంగాణ ప్రాంతంలో 15 ఏండ్లు నివసించి ఉంటే ఇక్కడ ముల్కీగా పరిగణించేవారు.
- ఆరు సూత్రాల పథకాన్ని రూపొందించడంలో కీలకపాత్ర పోషించినది కేసీ పంత్ (నాటి కేంద్ర నీటిపారుదల, విద్యుత్ శాఖ మంత్రి)

**18. ఆరు సూత్రాల పథకం అంశాల్లో లేనిదాన్ని గుర్తించండి?**

1) ప్రత్యేక నిధులు కేటాయించడం రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం ప్రాంతీయ అభివృద్ధి మండళ్లను ఏర్పాటు చేయాలి
2) హైదరాబాద్ నగరంలో ఒక కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలి
3) ఉద్యోగుల నియామకాలను సీనియారిటీ, పదోన్నతుల కోసం అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో ఏర్పాటు చేయడం
4) ముల్కీ నిబంధనలను మరో నాలుగు సంవత్సరాలు పొడిగించడం

**సమాధానం: 4**

**వివరణ:** ప్రత్యేక నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర రాజధానిని అభివృద్ధి చేయడం. రాష్ట్రస్థాయిలో ఒక ప్లానింగ్ బోర్డును, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం సబ్ కమిటీలను ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రక్రియలను పర్యవేక్షించాలి.

- విద్యాసంస్థల్లో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇచ్చే విషయంలో రాష్ట్రానికి అంతా ఒకే విధానాన్ని వర్తింపజేయాలి. రాష్ట్రంలో ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లో ఉన్నత విద్యావసతులు అభివృద్ధిపరచడానికి ఒక కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని (సెంట్రల్ యూనివర్సిటీ) స్థాపించాలి.
- రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా నేరుగా చేపట్టే ఉద్యోగ నియామకాల్లో నిర్దిష్ట పరిధి మేరకు స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి. అవి.. స్థానిక సంస్థలో నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలు, తహసీల్దార్, జూనియర్ ఇంజినీర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్.
- కొన్ని ఉద్యోగాలకు మినహాయింపులు కల్పిస్తారు. అవి.. నాన్ గెజిటెడ్ ఉద్యోగాలు, సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, ఇతర రాష్ట్రస్థాయి కార్యాలయాలు, హైదరాబాద్ సిటీ పోలీస్.
- ప్రమోషన్ల కోసం గెజిటెడ్ అధికారులను ప్రథమ, ద్వితీయ స్థాయిలుగా వర్గీకరించాలి.
- ఉద్యోగులు నియామకాలు, సీనియారిటీ, పదోన్నతులకు సంబంధించిన సమస్య పరిష్కారానికి అత్యున్నతాధికారం.

**19. ఆరు సూత్రాల పథకంపై సంతకాలు చేసిన తెలంగాణ నాయకులు ఎవరు?**

ఎ. పీవీ నరసింహారావు
బి. కోదాటి రాజమల్లు
సి. వీబీ రాజు　డి. జలగం వెంగళరావు

1) ఎ, బి　2) బి, డి
3) ఎ, డి　4) ఎ, బి, సి, డి

**సమాధానం: 4**

**వివరణ:** ఆరు సూత్రాల పథకంపై సంతకాలు చేసిన తెలంగాణ నాయకులు పీవీ నరసింహారావు, కోదాటి రాజమల్లు, వీబీ రాజు, జలగం వెంగళరావు, జే చొక్కారావు మొదలైనవారు. ఈ ఆరు సూత్రాల పథకాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కేసీ పంత్ మొహం మీదే వ్యతిరేకించి దానిపై సంతకాలు చేయలేమని చెప్పి వచ్చిన నాయకులు ఎస్‌బీ గిరి, జీఎస్ మేల్కొటే, మల్లికార్జున్, ఎంఎం హషీం మొదలైనవారు.

దొమ్మటి తిరుపతి
ఫ్యాకల్టీ,
ఎస్ జే ట్యుటోరియల్స్

